క్లుప్తంగా

నందీశ్వరునికి రుద్రాభిషేకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి శుక్రవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో త్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. విశేష పుష్పాలంకరణ, పంచహారతులు తదతర కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

మర్యాద పూర్వక కలయిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతిగా శుక్రవారం డాక్టర్ పి.చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ అసోసియేషన్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు వీసీని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. యూనివర్సిటీలో పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

దుర్గమ్మకు నృత్యార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీకనకదుర్గా నృత్య కళామందిర్‌కు చెందిన పలువురు ప్రదర్శించిన కూచిపూడి భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై వై.అనురాధ శిష్యబృందం పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

మధురంగా సాగిన వీణా వాద్య కచేరీ



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్యామశాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సంగీత నీరాజనం మధురంగా సాగింది. యువ సంగీత కళాకారులతో పాటు లబ్ధప్రతిష్టులైన విద్వాంసులు తమ కచేరీల ద్వారా గురుభక్తిని చాటుకున్నారు. సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి చిన్నారులు నిర్వహించిన వీణా వాద్య కచేరీ మధురంగా సాగింది. కార్యక్రమాలను సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామశాస్త్రి నాదోపాసకుడని, అమ్మవారి మీద అనేక కీర్తనలు రచించారని తెలి పారు. సంస్థ కార్యదర్శి సీవీ రావు మాట్లాడుతూ బాలబాలికలలోని ప్రతిభను ప్రోత్సహించడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయంతి ఉత్సవంలో గండూరి శ్రీనివాసమూర్తి, చిట్టా రామలక్ష్మితో ఫ్లూట్ కుమార్‌బాబు, వీణ సుజాత, రావుల మీరాతో పాటు నగరానికి చెందిన పలువురు విద్వాంసులు పాల్గొన్నారు. సీహెచ్ సూర్య, విమలేష్ వాద్య సహకారం అందించారు.

ప్రచారం ఫుల్.. సంపద నిల్

- చెత్తనుంచి సంపద మాటలకే పరిమితం
- ఆన్‌సైట్ వర్మీ కంపోస్ట్ యూనిట్ల సైట్లు వృథా
- నిరుపయోగంగా యూనిట్ల షెడ్లు
- యూనిట్లలో కానరాని పల్వరైజింగ్ మెషీన్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర పేరుతో నగరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు మొక్కుబడేనా? తడి.. పొడి చెత్తను వేరు చేసి తద్వారా సంపద సృష్టించవచ్చని అటు ప్రభుత్వం ఇటు నగరపాలక సంస్థ ప్రకటనలు గుప్పించి ప్రచారం చేస్తున్నాయి. ఇది ప్రచారానికే పరిమితం అవుతోంది.

దృష్టి సారించని అధికారులు..

నగరపాలక సంస్థ కమిషనర్లుగా పలువురు ఉన్నతాధికారులు విధులు నిర్వర్తించినా ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్లపై దృష్టి సారించలేదు. ముఖ్యంగా కంపోస్ట్ ప్లాంట్స్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాటి వైపే చూడలేదు.

వచ్చామా..వెళ్లామా అన్నట్టుగా..

నగరపాలక సంస్థకు ఎంత మంది కమిషనర్లు వచ్చినా ఆయా యూనిట్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎవరికివారు తమకు నెలనెలా జీతాలు వస్తున్నాయా లేదా అన్న ఆలోచన తప్ప ప్రజాప్రయోజనాల గురించి ఎందుకు పట్టించుకుంటారని ఆయా ప్రాంతాల ప్రజలు ఎద్దేవ చేస్తున్నారు.

సేంద్రియ ఎరువు కరువే..

ఇళ్లల్లో మొక్కలు పెంచుకునే వారికి గతంలో ఆన్‌సైట్ కంపోస్ట్ ప్లాంట్ నుంచి అతి తక్కువ ధరకు సేంద్రియ ఎరువు లభించేది. నగరపాలక సంస్థకు చెందిన పార్కులలో ప్లాంట్‌లద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువును వాడేవారు. ఇళ్ల వద్ద నుంచి సేకరించిన తడి చెత్తను తీసుకువచ్చి ప్లాంట్లలో డంప్ చేసేవారు. దానిని మెషీన్లలో వేసి క్రష్ చేసి కంపోస్ట్ కోసం నిర్మించిన పిట్లలో వేసేవారు. ప్రస్తుతం తడి చెత్తను అజిత్‌సింగ్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. వర్మీ కంపోస్ట్ ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణలో అనుభవంగల మద్దుకూరి సుబ్బారావును నగరపాలక సంస్థ గతంలో సలహాదారుగా నియమించుకుంది. ఆ సమయంలో నగరంలో 30 వర్మీ కంపోస్ట్ ప్లాంట్లు ఉండేవి. తద్వారా ఏడాదికి సుమారు 30 టన్నుల సేంద్రియ ఎరువు లభ్యమయ్యేది. ప్రస్తుత పరిస్థితులపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.



ఊర్మిళానగర్‌లో నిరుపయోగంగా ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్

కంపోస్ట్ యూనిట్లన్నీ మూసివేత..

లక్షలాది రూపాయలను ఖర్చు పెట్టి గట్టు వెనుక ప్రాంతంలో నగరపాలక సంస్థ నిర్మించిన అన్ని ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్లన్నీ మూతపడ్డాయి. ఊర్మిళానగర్ ప్లాంట్‌లో షెడ్, దానికి అనుబంధంగా నిర్మించిన మరో షెడ్ నిరుపయోగంగా ఉన్నాయి. ఆ ప్లాంట్‌లోని మెషీన్లు ఏమైపోయాయో తెలియని పరిస్థితి. ఇక విద్యాధరపురంలోని కబేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్ పరిస్థితికూడా అంతే. భవానీపురం రైతుబజార్‌లోని ప్లాంట్‌కు తాళం వేసి ఏళ్లు గడుస్తున్నాయి. భవానీపురం హౌసింగ్ బోర్డ్‌కాలనీలోగల పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్ మూతబడి శిథిలావస్థకు చేరుకుంది.



హౌసింగ్‌బోర్డ్‌కాలనీ పార్క్‌లో శిథిలావస్థలో ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్

ప్రారంభం అట్టహాసం



కబేళా ప్రాంగణంలో వృథాగా ఉన్న ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్

సేంద్రియ ఎరువు తయారీ కోసం నగరపాలక సంస్థ ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్ల సైట్లన్నీ (వర్మీ కంపోస్ట్‌లు) వృథాగా పడిఉన్నాయి. సుమారు తొమ్మిదేళ్ల క్రితం (టీడీపీ ప్రభుత్వ హయాం) గట్టు వెనుక ప్రాంతంలోని ఊర్మిళానగర్, కబేళా, భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీ, ప్రియదర్శినికాలనీ, రైతుబజార్‌లలో ఆన్‌సైట్ వర్మీ కంపోస్ట్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్తను పిట్లలో నిల్వ చేసి కంపోస్ట్ చేయగా కొన్నాళ్ల తరువాత అది ఎరువుగా తయారయ్యేది. భవానీపురం రైతుబజార్‌లో ప్లాంట్‌లో పనికిరాని కూరగాయలు, ఆకుకూరలను ప్లాంట్‌లోని పల్వరైజింగ్ మెషిన్లలో ద్వారా క్రష్ చేసి కంపోస్ట్ యూనిట్లకు పంపేవారు. ఆయా యూనిట్ల ద్వారా ఏడాదికి సుమారు 8– 10 టన్నుల వర్మీ కంపోస్ట్ (సేంద్రియ ఎరువు) తయారయ్యేది. నగరపాలక సంస్థకు చెందిన పార్కులలో చెట్ల నుంచి రాలిన ఆకులను నేరుగా కంపోస్ట్ చేయటం ద్వారా సేంద్రియ ఎరువు తయారవుతుంది. కానీ ఇప్పుడు రాలిన ఆకులను పోగేసి తగులబెడుతున్నారు.

ఆర్‌పీల సమస్యలు పరిష్కరించండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఏపీ మెప్మా ఆర్‌పీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మెప్మా ఆర్‌పీల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో మెప్మా ఆర్‌పీల ఉద్యోగుల సంఘం నగర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ మార్చి 20వ తేదీన ఆర్‌పీల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఆర్‌పీలందరూ ఐక్యంగా భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాన డిమాండ్‌లు అయిన వేతనం పెంపు, గ్రేడింగ్ విధానం రద్దు, ఉద్యోగ భద్రత, ఇతర సమస్యల పరిష్కారం కోసం మే 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పెద్ద సంఖ్యలో ఆర్పీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు, ఎ.కమల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, విజయవాడ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె దుర్గారావు, మెప్మా ఆర్‌పీల యూనియన్ నగర కార్యదర్శి శ్రీదేవి, నగర కోశాధికారి ఎ.శివలక్ష్మి, సుష్మ, జి.సలోమి, బి.భవాని, భవాని పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై ముస్లింల నిరసన



భవానీపురం(విజయవాడపశ్చిమ): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని స్థానిక ముస్లిం మైనార్టీలు ఖండించారు. భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని మస్జిద్‌–ఎ–సుమయ్య (రఅ) అహ్లే హదీస్ మసీదులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన నమాజు కార్యక్రమంలో భాగంగా పలువురు ముస్లింలు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ముష్కరుల అమానవీయ దుశ్చర్యలను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం నశించాలి, ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి, బాధితులకు న్యాయం చేయాలి అంటూ నినాదాలు చేశారు. హత్యాకాండకు పాల్పడిన ఉగ్రవాదులను మట్టుపెట్టాలని స్పష్టం చేశారు.

క్రిస్టియన్ కౌన్సిల్ ఖండన..

జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) రాష్ట్ర పొలిటికల్ వింగ్ అధ్యక్షులు మద్దిరాల కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



ప్రపంచ మలేరియా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ మలేరియా దినోత్సవం, ఫ్రైడే డ్రైడే పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా విభాగం, నగర పాలక సంస్థ వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త అధ్వర్యంలో నగర పరిధిలోని జక్కంపూడి కాలనీలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మలేరియా నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ నగర పాలక సంస్థ కమిషనర్ తో కలిసి ఇంటి లోపల, పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో లార్వా గుర్తింపు నిర్వహించి, వ్యాధుల సంక్రమణపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ వ్యాధులకు కారకాలైన దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించే కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ మలేరియా డెంగీ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాప్తికి కారకాలైన దోమలు ప్రబలకుండా వాటి వ్యాప్తిని అరికట్టాలన్నారు. 2030 నాటికి దేశ వ్యాప్త మలేరియా నిర్మూలన లక్ష్యానికి ముందుగానే జిల్లాను మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చునని అన్నారు. జక్కంపూడి కాలనీలోని 10 బ్లాకుల్లో ఇంటింటా పర్యటించి నివాసితులతో కరపత్రం చదివించి వారికి అవగాహన కల్పించారు. సెప్టిక్ ట్యాంకులు మరుగుదొడ్లపై గొట్టాలకు నైలాన్ తెరలను దగ్గర ఉండి కట్టించి వాటిని డ్రోన్ ద్వారా పర్యవేక్షించారు. బుడమేరులో పేరుకుపోయిన విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తొలగింపును స్వయంగా పర్యవేక్షించారు. జక్కంపూడి కమ్యూనిటీ హాల్‌లో దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల రకాలు, జీవిత చరిత్ర, వాటి నివారణకు తీసుకునే చర్యలు, దోమల నివారణకు ఉపయోగించే యంత్ర సామగ్రి , డ్రోన్లు, కటింగ్ మిషన్లు తదితర సామగ్రి ప్రదర్శనను పరిశీలించారు. సమావేశంలో ప్రజలతో దోమల నివారణకు తీసుకునే చర్యలు, డ్రైడే ఫ్రైడే కార్యక్రమ ఆవశ్యకత, ధృడ సంకల్పంతో మలేరియా, డెంగీ పారదోలతాం అని ప్రతిజ్ఞ, నినాదాలు చేయించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉషారాణి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీ బాబు,నగరపాలక సంస్థ ఇన్‌చార్జి చీఫ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ నాయక్, బ యాలజిస్ట్ సూర్య నాయక్, వైద్యాధికారులు, ఎంపీ డీఓ, మండల స్పెషల్ ఆఫీసర్, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, సబ్ యూనిట్ అధికారులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలోని శాఖలన్నీ సమన్వయంతో పని చేస్తేనే నగరం పరిశుభ్రంగా ఉంటుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం క్రాంబే రోడ్, బైపాస్ రోడ్, సితార రోడ్, అంబేద్కర్ రోడ్, సీవీఆర్ ఫ్లైఓవర్, జక్కంపూడి ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఉద్యానవన శాఖల మధ్య సమన్వయం కచ్చితంగా ఉండాలని, ఒకరితో ఒకరు సమస్యను చర్చించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిపించాలని అన్నారు. శానిటరీ సెక్రటరీలు నిర్మాణ వ్యర్థాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే ప్లానింగ్ సెక్రటరీ సమన్వయంతో వ్యర్థాలను తొలగించాలని, అలా ప్రతి శాఖతో సమన్వయపరచుకుని శానిటరీ సెక్రటరీలు ఎక్కడ వ్యర్థాలు ఉన్నా రోడ్డుపైన నిలవ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయంతో ప్రతిరోజు రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, అంతర్గత రోడ్లలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రపరచాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.



పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

మే 20న గ్రామీణ హర్తాళ్‌ను జయప్రదం చేయండి

కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, గ్రామీణ పేదల హక్కులు, ఉపాధి హామీని కాపాడుకునేందుకు మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ హర్తాళ్‌ను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షతన రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తూ దేశ ప్రజలు త్యాగాలతో స్థాపించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న మోదీ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా మే 20న కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయట పడేస్తానని, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పిన మోదీ మాటలు నీటి మూటలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఏ పంటలు వేయాలో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పిలుపునిచ్చిన హర్తాళ్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు, కనీస వేతనం రోజుకు రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పరిరక్షణ కోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తనను వేధిస్తున్నాడంటూ భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట ఆంజనేయ వాగుకు చెందిన కుంచం భూమిక, భానుప్రకాష్‌లు భార్యభర్తలు. వీరికి 2023లో ప్రేమవివాహం కాగా ఒక కుమార్తె ఉంది. భానుప్రకాష్ సరిగా పనికి వెళ్లకుండా, భార్య పనికి వెళ్లితే అనుమానంతో వేధించసాగాడు. ఇటీవల ఆటో కొనుగోలు చేసిన భానుప్రకాష్ పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురమ్మని భూమికను వేదించసాగాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో భూమికను పుట్టింటి వద్ద వదిలి డబ్బులు తీసుకు వస్తేనే ఇంటికి రావాలని చెప్పాడు. దీంతో బాధితురాలు భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాదుల కుట్రలను తిప్పికొట్టాలి : పోతిన



కొవ్వొత్తుల ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న పోతిన వెంకట మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి మానవత్వాన్ని మంటగలిపిన మారణకాండ అని వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకటమహేష్ అన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కొత్తపేట నెహ్రూ బొమ్మసెంటర్‌లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటమహేష్ మాట్లాడుతూ ఈ ఘటనను పర్యాటకులపై జరిగిన దాడి మాత్రమే కాదని, దేశంపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉగ్రవాదులు కుట్రపన్నారన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. దేశంలోని మన పౌరుల్ని మనమే మతం, ప్రాంతాల పేరుతో దూరం చేసుకుంటే ఉగ్రవాదుల అభిమతం నెరవేరినట్లు అవుతుందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. అటువంటి కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ మాల మహానాడు అధ్యక్షులు శ్యామ్, పిల్లా శ్రీను న్యాయవాది గంగాధర్, షాహినా, పైల పవన్, సుఖాసి భాను, పిల్లా రవి, తమ్మిన రఘు, సా బిన్కర్ నరేష్, సోమీ మహేష్, రోహిత్, చిన్నారావు, ప్రశాంత్ పాల్గొన్నారు.



పంజా సెంటర్‌లో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న ముస్లింలు

ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో...

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్మూ కాశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు పిరికి పందచర్య అని ఎంసీపీఐ(యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కే ఖాదర్‌బాషా అన్నారు. పహల్‌గామ్ ఉగ్రదాడులను వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పంజా సెంటర్‌లో శుక్రవారం ప్రార్థన అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఖాదర్ బాషా మాట్లాడుతూ కాశ్మీర్‌లో భద్రత పెంచి పర్యాటకులకు ధైర్యం, భరోసా కల్పించాలన్నారు. దేశంలో ఉగ్రవాదులను రూపుమాపాలని కోరారు. భద్రతా రంగంలో ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ అఫ్సర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడుల విషయంలో కులమతాలు, రాజకీయాలకతీతంగా దేశ ప్రజలందరూ ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు సమీర్, తాజుద్దీన్, ఖాజావలీ, సమద్, ఎండీ ఫరూక్, వాహేద్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధిక సంపత్తికి చట్టాల రక్షణ అవసరం



మాట్లాడుతున్న హృషీ కేశవరాజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బౌద్ధిక సంపత్తికి హక్కులకు (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్) సంబంధించిన ఆవిష్కరణలకు చట్టబద్ధమైన రక్షణ అత్యంత అవసరమని ప్రముఖ ఐపీఆర్ నిపుణుడు డాక్టర్ ఎస్.హృషీకేశవరాజు అన్నారు. కేబీఎన్ కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హృషీకేశవరాజు మాట్లాడుతూ నూతన ఉత్పత్తిని తీసుకురావడంతోపాటు దానికి ఇండస్ట్రియల్ డిజైన్, జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్, ట్రేడ్ మార్క్ మొదలైనవి పొందడం చాలా ముఖ్యమన్నారు. ఇవన్నీ వినియోగదారుల్లో విశ్వసనీయత పెంచుతాయన్నారు. పేటెంట్ హక్కుల దఖలులో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పాత్ర ఎంతముఖ్యమో ఉదాహరణలతో చర్చించారు. రచనలు, కళాకృతులు, సాఫ్ట్‌వేర్ వంటి సృజనాత్మక కృత్యాలకు సంబంధించి కాపీరైట్స్ వహించే భూమికను విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. ఇండస్ట్రియల్ డిజైన్ ప్రాధాన్యత, నూతన ఆవిష్కరణలకు చట్టపరమైన రక్షణ, వాటిని పొందే విధానాన్ని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి మాట్లాడుతూ యువతలో స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహిస్తూ వ్యాపారవేత్తలుగా ఎదగటం ద్వారా లభించే లాభాలను వివరించారు. రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, ఐపీఆర్ సెల్ కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ఆర్ సాయి కృష్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాసం.. పెద్ద ఎత్తున జరుగుతున్న వివాహాలు, వేసవి సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి దుర్గామల్లేశ్వరస్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే దుర్గామల్లేశ్వరస్వామివార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. అంతరాలయంలో ప్రధాన మూలవిరాట్ వద్ద ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో జరిగిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, నవగ్రహ హోమం, గణపతి హోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు. రూ. 300 టికెట్‌పై ముఖ మండప దర్శనాన్ని కల్పించిన ఆలయ అధికారులు, రూ. 100, సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తులు ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం మహా నివేదన అనంతరం భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఎండల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణం, మైక్ అనౌన్స్ పాయింట్ వద్ద దేవస్థానం భక్తులకు మజ్జిగను పంపిణీ చేసింది. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు